క్లుప్తంగా

రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..



రైతులకు వ్యవసాయ పరికరాలకు సంబంధించిన ధ్రువపత్రాలు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్

బొండపల్లి: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్,ఎన్ఆర్ఐ, సాధికారిత సంబంధాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గజపతినగరం వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలో ని నాలుగు మండలాలకు చెందిన 36 మంది రైతులకు గొట్లాం రైతు సేవా కేంద్రం వద్ద రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు పవర్ టిల్లర్లు, పాడీ క్రషర్లు, పవర్ స్ప్రేయర్లు, దుక్కు పరికరాలను 50 శాతం రాయితీపై అందించామన్నారు. జిల్లా వ్యవసాయశాఖ జేడీ వి.టి.రామారావు, ఏడీఏ కె.మహరాజన్, బొండపల్లి,గంట్యాడ, దత్తిరాజేరు మండలా టీడీపీ నాయకులు కోరాడ కృష్ణ, కొండపల్లి భాస్కర నాయుడు, చప్పా చంద్రశేఖర్, పి.వి.గోపాల రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా టీకాలు వేయాలి



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్ఓ జీవనరాణి

బొండపల్లి: గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా నిర్ణీత సమయానికి టీకాలు వేయాల్సిన బాధ్యత గ్రామాల్లోని వైద్య సిబ్బందిపై ఉందని డీఎంహెచ్ఓ జీవనరాణి అన్నారు. గొట్లాం గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని శనివారం సాయంత్రం సందర్శించారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. 10 నుంచి 15 ఏళ్ల వయస్సులోపు పిల్లలకు టీడీ వ్యాక్సిన్లు తప్పనిసరిగా వేయాలని చెప్పారు. వ్యాక్సినేషన్ వివరాలను ఎప్పటికప్పుడు యూవిన్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. చిన్నపిల్లలకు వేయాల్సిన వ్యాక్సిన్ల విషయంలో అశ్రద్ధ చేయవద్దని చెప్పారు. సీసీ చంద్రశేఖర్ రాజు, హెచ్‌సీ రాధామణి, ఎంఎల్‌హెచ్‌పీ వసంతలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



రికార్డులను పరిశీలిస్తున్న డీపీహెచ్ఎన్ఓ సత్యవతి

గంట్యాడ: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో(కేజీబీవీ)విద్యార్థినుల ఆరోగ్యంపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డీపీహెచ్ఎన్ఓ మామిడి సత్యవతి అన్నారు.స్థానిక కేజీబీవీని జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం శనివా రం సందర్శించింది.విద్యార్థినుల ఆరోగ్య సమాచార, ఇతర రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో డీపీహెచ్ఎన్ఓ సత్యవతి మాట్లాడుతూ రక్తహీనత బారినపడకుండా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్నవారు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేసుకోవాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. టాస్క్ ఫోర్స్ బృంద సభ్యులు రామానుజుల నాయుడు, గంట్యాడ పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ ఎర్రన్న, హెచ్ఈ ఎన్.సరళ, ఎంఎల్‌హెచ్‌పీ జి.నారాయణమ్మ, కేజీబీవీ ఎస్ఓ అల్లు జ్యోతి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

గంట్యాడ: ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. గజపతినగరం నియోజకవర్గంలో పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి విడుదలైన రూ.9.30 లక్షలకు సంబంధించిన చెక్కులను మండల కేంద్రంలోని తన నివాసంలో శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులకు సహాయం కోసం ఎదురుచూస్తున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఆసరాగా మారిందని తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.వి.బి.సుబ్రహ్మణ్యం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మీసాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- వడదెబ్బకు గురికాకుండా, వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తప్పనిసరి
- ఆరోగ్య సంరక్షణలో ఆహారానిదే కీలకపాత్ర
- ద్రవపదార్థాలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని వైద్యుల సూచన

సమతుల ఆహారంతోనే.. ఆరోగ్యం



ఖనిజ లవణాలతో రోగనిరోధక శక్తి బలోపేతం

వేపాడ: వేసవి ఎండల తీవ్రత పెరిగింది. గత కొద్దిరోజులుగా ఉష్ణోగ్రతలు 35 నుంచి 40 డిగ్రీల మధ్యలో నమోదవుతున్నాయి. రాబోయే రోజుల్లో వడగాల్పులు వీచే అవకాశం కూడా ఉందని వాతావరణ శాఖ అధికారులు ముందుగానే హెచ్చరిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, చర్మ, ఇతర వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని వైద్యనిపుణులు అంటున్నారు. వీట న్నింటినీ తట్టుకోవడానికి రోగ నిరోధకశక్తిని పెంచే విధంగా సమతుల ఆహారం, శరీర ఉష్ణోగ్రతలను క్రమపరిచే విధంగా ద్రవపదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. మనం తినే ఆహారం మన ఆరోగ్యాన్ని కాపాడుతుందనే ఆలోచన కలిగి ఉండాలి. ఆరోగ్య సంరక్షణలో ఆహారానిదే కీలకపాత్ర అని వైద్యులు చెబుతున్నారు.

ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి

వేసవితాపాన్ని తట్టుకోలేక చాలా మంది చల్లని ద్రవ పదార్థాలు తీసుకోవడానికి ఇష్టపడతారు. శరీరంలో 60 నుంచి 70 శాతం వరకు నీరు ఉం[టుంది]. అధిక ఉష్ణోగ్రతలను తగ్గించడంలో **నీరు ప్రముఖపాత్ర పోషిస్తుంది.** రోజుకు సగటున 3 **నుంచి 5** లీటర్ల నీటిని తీసుకుంటూ శరీరంలో 70 శాతం నీరు ఉండేలా చూసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఆరోగ్యవంతంగా ఉండడంతో పాటు వడదెబ్బకు గురికాకుండా తప్పించుకోవచ్చు.ఎండల్లో ఎక్కువగా తిరగాల్సి వస్తే మజ్జిగతోపాటు కొబ్బరినీరు, లస్సీ, చెరుకు రసాలను ఐస్ వినియోగించకుండా తీసుకోవడం మంచిది. ఉల్లిపాయల్లో శరీరాన్ని చలబరిచే గుణం ఉంటుంది. ఉల్లిని నిత్యం ఆహారంలో తీసుకుంటే వడదెబ్బకు గురికాకుండా కాపాడుతుంది. మజ్జిగ శరీరంలో జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంతోపాటు అందులో ప్రోబయోటిక్స్ అధికంగా ఉంటాయి. వేసవిలో నీరు, జ, నిమ్మరసాలను తాగితే వడదెబ్బను తట్టుకోవచ్చును. రాగులు, సామలు, కొర్రలు, జొన్నలు వంటి చిరు ధాన్యాలు తీసుకోవడం వల్ల శరీరం ఎండతీవ్రతను **తట్టుకోవచ్చు. ఏ సమయంలోనైనా పండ్లు తీసుకోవడం ఆరోగ్యా నికి ప్రయోజనకరమేనని వైద్యులు చెబుతున్నారు.**

వేసవిలో రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు మనం తీసుకునే ఆహారంలో ఖనిజ లవణాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. పాలు, గుడ్లు, టమోటా, నారింజ, చిలగడ దుంపలు, చేపలు, బ్లాక్ బెర్రీ, బ్లూ బెర్రీ తినడం మంచిది.అలాగే బీరకాయ, సొరకాయ, దోసకాయ, పొట్లకాయలాంటి కూరగాయలు, పాలకూర,తోటకూర వంటి ఆకుకూరలు శరీరానికి శక్తినిస్తాయి. తద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు. కొబ్బరి నీరు తీసుకోవడంవల్ల ఖనిజ లవణాలు ఎక్కువ శక్తిని ఇచ్చి వేడి గాలుల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది.

పోషకాల కోసం పండ్లు

పోషకాల శాతం ఎక్కువ ఉండే పండ్లను రోజూ తీసుకోవాలి. బొప్పాయి, జామి, అరటి, యాపిల్, పుచ్చకాయ, కర్బూజ వంటి పండ్లు తీసుకోవడం **మంచిది. బత్తాయి, కమల, నారిం[జ]**



జాగ్రత్తలు పాటించాలి



ఎండల తీవ్రత పెరిగిపోతోంది. వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి. వడదెబ్బకు గురైన వారిని గాలి బాగా ఆడే చల్లని ప్రదేశంలోకి చేర్చాలి.శరీరంపై దుస్తులను తొలగించి సాధా రణ ఉష్ణోగ్రత వచ్చే వరకు చల్లని నీటిలో ముంచిన గుడ్డతో తుడుస్తూ ఉండాలి. సమీపంలోని ఆస్పత్రికి తరలించాలి.అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల మధ్య ఎండలో తిరగకపోవడం శ్రేయస్కరం. తెల్లటి, కాటన్ దుస్తులు ధరించాలి. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం అయిదు లీటర్ల నీరు తాగాలి. ఓఆర్ఎస్ ద్రావణం, పండ్లు, నిమ్మరసం, పలచటి మజ్జిగ, కొబ్బరినీళ్లు, చెరకురసం ఎక్కువగా తీసుకోవాలి. కారం, నూనె, మసాలాలు ఎక్కువగా వేసే ఆహారపదార్థాలకు, ఫాస్ట్‌ఫుడ్, మత్తుపానీయాలకు దూరంగా ఉండాలి. కాఫీ, టీఅలవాటు ఉన్నవారు వీలైనంత తగ్గించుకోవడం మంచిది. చిరుధాన్యాలు, పండ్లు, పండ్ల రసాలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

– కె.అజయ్‌కుమార్, వైద్యాధికారి, వేపాడ పీహెచ్‌సీ

గరం గరం

గుర్ల: మండల కేంద్రంలో డయేరియాతో మృతి చెందిన వారి కుటుంబాలకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటించిన రూ.లక్ష చొప్పున చెక్కుల పంపిణీ శనివారం గరంగరంగా సాగింది. 13 మంది మృతిచెందితే 10 మంది పేరునే చెక్కులు అందజేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. మరోవైపు కార్యక్రమంలో స్థానిక నాయకులకు ఎలాంటి ప్రాధాన్యం లేకపోవడం, అంతా నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకంనాగమాధవి కనుసన్నల్లోనే జరగడంతో చీపురుపల్లి నియోజకవర్గ టీడీపీ, జనసేన నాయకులు గుసగుసలాడారు. కొందరు బహిరంగంగానే విమర్శించారు. మరికొందరు కార్యక్రమంలో పాల్గొనకుండానే వెళ్లిపోయారు. స్టేజ్‌పైకి నెల్లిమర్ల జనసేన నాయకుడు చనమల్లు వెంకటరమణను పిలవకపోవడంతో ఆయన సాధారణ జనసేన కార్యకర్తవలే స్టేజ్ కిందే ఉండిపోయారు. ఈ ఘటనపై ఆయన అనుచరులు రగిలిపోయారు. చెక్కుల పంపిణీ స్టేజ్‌పై వేసిన ఫ్లెక్సీలో చీపురుపల్లి నియోజక వర్గం జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు ఫొటో లేకపోవడంతో పార్టీ కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే అనుచరులతో వాగ్వాదానికి దిగారు. చెక్కుల పంపిణీకి చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు కుమారుడు కిమిడి రామ్‌మల్లిక్ నాయుడును చీపురుపల్లి జనసేన నాయకులు ఆహ్వానించారు. కళా వెంకటరావు ఫొటోను ఫ్లెక్సీలో వేయకపోవడం, జనసేన పార్టీకి చెందిన కార్యక్రమం అని స్పష్టంచేయడంతో గుర్ల వరకు వచ్చిన రామ్‌మల్లిక్‌నాయుడు స్థానిక టీడీపీ నాయకుడి ఇంటి వద్ద కాసేపు ఉండి వెనుదిరిగారు.

హైకోర్టు జడ్జిని కలిసిన న్యాయవాదులు



న్యాయమూర్తి రవిని సన్మానిస్తున్న లాయర్లు

శృంగవరపుకోట: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు పోలియో జడ్జి చీమలపాటి రవిని ఎస్.కోట న్యాయవాదులు జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్.కోట బార్ అసోసి యేషన్ సభ్యులు న్యాయమూర్తికి శాలువా కప్పి సన్మానించారు. ఈసందర్భంగా ఎస్.కోట కోర్టులో సమస్య లపై వినతిపత్రం అందజేశారు. అద్దె భవనంలో నడుస్తున్న కోర్టుకు శాశ్వత భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిదేముడు, తదితర న్యాయవాదులు కోరారు.న్యాయమూర్తి స్పందిస్తూ గతం లో మీరు హైకోర్టుకు వచ్చి వినతిపత్రం ఇచ్చిన విషయం గుర్తుందని, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ద్వారా ప్రభుత్వానికి లేఖ పంపి, నిధులు మంజూరుకు కృషి చేస్తామని చెప్పా రు.జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సాయికల్యాణ చక్రవర్తి, ఎస్.కోట బార్ అసోసియేషన్ అధ్య క్ష, కార్యద ర్శులు జి.సూరిదేముడు, బి.వి.ఎస్.రామారావు, న్యాయవాదులు వారాది ఈశ్వరరావు, డబ్ల్యూ.ఎన్. శర్మ, బి.సత్యనారాయణ, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా పనులెలా చేస్తారు..?



ఎంపీడీఓను ప్రశ్నిస్తున్న శింగరాయి సర్పంచ్ వెంకటరావు

వేపాడ: తమ ప్రమేయం లేకుండా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పనులను వెండర్లతో ఎలా చేయిస్తున్నారని పలు గ్రామాల సర్పంచ్‌లు అధికారులను నిలదీశా రు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షత న శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి నిధులతో చేపట్టాల్సిన పనులకు సర్పంచ్‌లు తీర్మానాలు చేశారని, వాటిని కాదని, సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా వెండర్లతో పనులు చేయించడం ఎంతవరకు సమంజసమని ఎంపీడీఓ సూర్యనారాయణను ప్రశ్నించారు. సర్పంచ్‌లతోనే పనులు చేయించాలన్న కోర్టు ఆదేశాలను ఎందుకు అమలు చేయ డం లేదని నిలదీశారు. ఎంపీడీఓ స్పందిస్తూ సమస్య ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. మండలానికి 100 సీసీ రోడ్లు మంజూరు కాగా 60 పూర్తయ్యాయని పీఆర్ ఏఈ ఆలీ సభకు వివరించగా... వాటిలో సర్పంచ్‌లు ఎన్ని పనులు చేశారని ఎంపీపీ ప్రశ్నించారు. ఏఈ బదులిస్తూ పాటూరు పంచా యతీలో మాత్రమే సర్పంచ్ చేశారని, మిగిలిన పంచాయతీల్లో వెండర్లు చేశారని చెప్పారు. వెండర్లను ఎవరు నియమించారని తిరిగి ఎంపీపీ ప్రశ్నించగా..ఏఈ సమాధానం దాటవేశారు. దీంతో నీలకంఠరాజపురం ఎంపీటీసీ వేచలపు చినరామునాయుడు స్పందిస్తూ చేస్తున్నవి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు కాబట్టి సమస్యలను గాంధీజీకే చెప్పుకోవాలేమో అని అన్నారు. ఏఓ యశ్వంతరావు మాట్లాడుతూ ఎస్.కోట నియోజకవర్గానికి సంబంధించి జామి మండల కేంద్రంలో అపరాల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ రాములమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి, ఉపాధి ఏపీఓ ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, వైస్ ఎంపీపీలు అడపా ఈశ్వరావు, దాయిరి ముత్యాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపే లక్ష్యం

- కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్



బొండపల్లి:.కెరటాంలో ఫారం పాండ్‌ల పనులను ప్రారంభిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్



లక్కవరపుకోట: ఖాసాపేటలో భూమిపూజ చేసి ఫారం పాండ్ తవ్వకాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

బొండపల్లి: జిల్లాలో భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యంగా గ్రామాల్లో పెద్ద ఎత్తున ఫారం పాండ్‌ల తవ్వకాలు చేపడుతున్నట్లు కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ తెలిపారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా మండలంలోని కెరటాం గ్రామంలో శనివారం ఫారం పాండ్‌లు తవ్వకాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెలాఖరు నాటికి జిల్లా వ్యాప్తంగా 3,215 ఫారం పాండ్‌లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. అలాగే జిల్లా వ్యా ప్తంగా 27 మండలాల పరిధిలో 5,747 ఫారం పాండ్‌లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఉపాధి వేతనదారులకు రోజుకు కనిష్టంగా రూ.300 వేతనం వచ్చేలా ఉపాధిహామీ పథకం అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎండలు తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 6:30 గంటలకు పనులకు హాజరై 10 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం 4గంటలకు హాజరై సాయంత్రం 6:30 గంటల వరకు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.వేతనాలు సక్రమంగా అందుతున్నాయా అని ఉపాధి వేతనదారులను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశాల్లో వేతనదారులకు సౌకర్యాలు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఉపాధి హామీ పీడీ శారదాదేవి, డీపీఓ టి.వెంకటేశ్వరరావు, ఏపీఓ బి.కృష్ణవేణి, ఈసీ ఆర్.సన్యాసిరావు,కెరటాం సర్పంచ్ సుంబూరి రాజేష్ (బుజ్జిరాజు) పాల్గొన్నారు.

భూగర్భ జలాలు పెంచేందుకు చర్యలు

లక్కవరపుకోట: భూగర్భ జలాలు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఖాసాపేట గ్రామ సమీపం లోని పొలంలో ఫారం పాండ్‌ల తవ్వకాల పనులను శనివారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా విరివిగా ఫారం పాండ్ ల తవ్వకాలు చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ ఏపీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 172 ఫారం పాండ్‌లను తవ్వించనున్నామని చెప్పారు. ఎంపీడీఓ ఎస్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వివాదాలు వద్దు

చీపురుపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంతం వాతావరణం ఉండాలని ఎలాంటి వివాదాలు ఉండకూడదని ఎస్ఐ ఎల్.దామోదరరావు చెప్పారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు మండలంలోని రావివలసలో శుక్రవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు.గ్రామసచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టానికి ఎవ్వరూ అతీతులు కారని,నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోయాయని,ఎలాంటి ఫోన్ కాల్స్‌కు వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు.

ఆక్రమణల గుర్తింపు

గజపతినగరం రూరల్: స్థానిక పురిటిపెంట రైల్వేస్టేషన్ సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలపై కొంతమంది స్థానికులు తహసీల్దార్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు.తహసీల్దార్ ఆదేశాలతో గజపతినగరం, పురిటిపెంట వీఆర్‌ఓలు శనివారం ఆక్రమణలను గుర్తించారు.వారం రోజుల్లోగా ప్రభుత్వ స్థలాలను ఖాళీచేయాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆక్రమణదారులను హెచ్చరించారు.

నేడు వాహనాల దారి మళ్లింపు

దత్తిరాజేరు: పెదమానాపురం జాతీయరహదారిలో వంతెన నిర్మాణంలో భాగంగా ఆదివారం పిల్లర్లు ఎక్కించే పనులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వంతెన వద్ద తాత్కాలిక రహదారి మీదుగా వాహనాల రాకపోకలనుమళ్లిస్తున్నట్లు పెదమానపురం ఎస్ఐ జ యంతి శనివారం తెలిపారు. విజయనగరం నుంచి పార్వతీపురం వచ్చే వాహనాలు గజపతినగరం కూడలి మీదుగా వయా దత్తిరాజేరు కోమటిపల్లి మీదుగా పార్వతీపురం సాలూరు వైపు వెళ్లాలని సూచించారు. పార్వతీపురం,సాలూరు నుంచి విజయనగరం, విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలు రామభద్రపురం, శికారుగంజి కూడలి నుంచి దత్తి, పోరళి,గజపతినగరం మీదుగా విజయనగరం వైపు వెళ్లాలని సూచించారు.

క్షయపై అప్రమత్తత అవసరం



క్షయ(టీబీ) వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వియ్యంపేట పీహెచ్‌సీ ఆరోగ్య సహాయకులు సత్యారావు సూచించారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కొటానివానిపాలెం గ్రామంలో ఉపాధి వేతనదారులకు శనివారం అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు,జ్వరం,బరువు తగ్గడం ,ఆకలి మందగించడం, కఫం ద్వారా రక్తపు జీరలు పడటం వంటి లక్షణాలు ఉంటే క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంత రం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.టీబీ అంతం..మనందరి పంతం, క్షయని నిర్మూలిద్దాం..ఆరోగ్యవంతమైన సమాజా న్ని నిర్మిద్దామంటూ వైద్యసిబ్బంది నినాదాలు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ నూకరాజు, వైద్యసిబ్బంది నరసింహరావు, ఈశ్వర రావు,భవానీ తదితరులు పాల్గొన్నారు.

– కొత్తవలస

అమ్మవారి మంగళసూత్రాలకు రూ.లక్ష విరాళం



రంగరాయపురం గ్రామంలోని రామాలయంలో సీతాదేవి అమ్మవారికి మంగళ సూత్రాలు తయారీ నిమిత్తం ఎల్.కోట మండల కేంద్రానికి చెందిన వీరాంజనేయ మత్స్యకార సంఘం రూ.లక్ష విరాళం ప్రకటించింది. నగదును రంగరాయ పురంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావుకు శనివారం అందజేశారు. మత్స్యకార సంఘం సభ్యులు రామారావు, ఈశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

– లక్కవరపుకోట

సౌకర్యాల కల్పన మన బాధ్యత



ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఏపీపీటీడీ జిల్లా ప్రజారవాణాధికారి అప్పలనారాయణ, తదితరులు

శృంగవరపుకోట:ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడం మన బాధ్యతని, వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చి, లక్ష్యాలు సాధించేందుకు పనిచేయాలని ఏపీపీటీడీ జిల్లా ప్రజారవాణాధికారి సీహెచ్.అప్పలనారాయణ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోను శనివారం ఆయన సందర్శించారు డిపోలో ఉన్న అన్ని సెక్షన్లు, బస్‌స్టేషన్, పార్సిల్ కౌంటర్లను తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం డిపో మేనజర్ కె.రమేష్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. చలివేంద్రాన్ని మే నెలాఖరు వరకూ కొనసాగించాలని డిపో మేనజర్‌కు సూచించారు. డీఎం రమేష్, ఏఎం కృష్ణారావు, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్నదొరపాలెంలో గ్రామ సభ రేపు

కొత్తవలస: మండలంలోని రెల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో 1-8 సర్వే నంబర్‌లో 526 ఎకరాలను గ్రేహౌండ్స్ (పోలీస్ శిక్షణ కేంద్రం)కు కేటాయింపుపై అప్పన్నదొరపాలెంలో సోమవారం గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బి.నీలకంఠరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.సభకు స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, విజయనగరం ఆర్డీఓ దాట్ల కీర్తి హాజరవు తారని పేర్కొన్నారు. పోలీస్ శిక్షణ కేంద్రానికి భూముల కేటాయింపులపై గిరిజనుల అభిప్రాయం సేకరించనున్నట్లు స్పష్టం చేశారు.

జెడ్పీ నిధులతో హ్యాండ్ బోర్లు


వేపాడ: సోంపురం గ్రామంలో జిల్లా పరిషత్ నిధులతో నాలుగు హ్యాండ్ బోర్లు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు తెలిపారు. బోర్ల డ్రిల్లింగ్ పనులకు శనివారం ఆయన భూమి పూజ చేశారు.

ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దేవి, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, ఎంపీటీసీ ఆకుల సత్తిబాబు,ఉప సర్పంచ్ సత్యారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీను, టి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.


శ్మశానవాటికలో బోరు ఏర్పాటు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని ఏనుగువలస గ్రామ శ్మశానవాటికలో హ్యాండ్ బోరు ఏర్పాటుకు సంబంధించిన డ్రిల్లింగ్ పనులను సర్పంచ్ మీసాల నాగభూషణరావు శనివారం ప్రారంభించారు. బోరు ఏర్పాటుకు మండల పరిషత్ నుంచి ఎంపీపీ మీసాల విజయ లక్ష్మి రూ.1.20 లక్షలు మంజూరు చేశారని సర్పంచ్ చెప్పారు. స్థానికులు ఎం.వి.రమణ, ఎం.వెంకటరమణ, వి.శ్రీనివాసరావు, వి.భాస్కరరావు, ఎం.జగదీష్ పాల్గొన్నారు.

శిశుపోషణపై అవగాహన కల్పించాలి



గజపతినగరం: గజపతినగరంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు చేస్తున్న ఐసీడీఎస్ పీడీ సుల్తాన్ బేగం



శృంగవరపుకోట: ఎస్.కోటలో శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు

గజపతినగరం: పిల్లల పోషణ, వారి ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందని ఐసీడీఎస్ పీడీ షేక్ రుక్సానా సుల్తాన్ బేగం అన్నారు.స్థానిక వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ-బి, ప డాయి-బి కార్యక్రమంపై ఇస్తున్న శిక్షణను శనివారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పిల్లల్లో బుద్ధిమాంద్యం, రక్తహీనత వంటి సమస్యలను గుర్తించాలని, శిశుమరణాల రేటు పెరగకుండా చూడాలని సూచించారు. అనంతరం పురిటిపెంట- 3, గజపతినగరం-3, 4 అంగన్‌వాడీ కేంద్రాలను పీడీ సందర్శించి, రికార్డులను పరిశీలించారు.ఐసీడీఎస్ పీఓ పి.నాగమణి, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

బాల్యవిద్యపై అవగాహన కల్పించాలి

శృంగవరపుకోట: మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ పీఓ ఉమ నేతృత్వంలో తిమిడి సెక్టార్‌కి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు శనివారం శిక్షణ ఇచ్చారు. పీఓ మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులకు బాల్యవిద్యపై అవగాహన కల్పించాలని చెప్పారు.

అంకితభావంతో పనిచేయాలి

గుర్ల: అంగన్‌వాడీ కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. గుజ్జింగివలసలో అంగన్ వాడీల శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందించాలని సూచించారు. ఐసీడీఎస్ ఆరుద్ర పాల్గొన్నారు.